
KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...


## నేటి మాట

కులం పునాదుల మీద మీరు ఏమి సాధించలేరు. ఒక జాతిని నిర్మించ లేరు. ఒక నీతిని నిర్మించ లేరు.



-డా.బి.ఆర్.అంబేద్కర్


Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 347 | శనివారం 29 నవంబర్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-


# అమరావతిని అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: కేంద్రమంత్రి



2 లో

అమరావతి నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడం అంటే ఒక యజ్ఞం వంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమరావతిలో బ్యాంకు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం నూతన రాజధాని నిర్మాణం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ఆర్థికంగా ఎంతో వ్యయప్రయాసలను కూర్చాల్సి ఉంటుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోనే అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ. 1334 కోట్ల వ్యయంతో 25కు పైగా బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.

అమరావతి నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేయడం శుభ పరిణామంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పం కలిసి రాష్ట్రానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయన్నారు. రాజధాని మౌలిక వసతుల కల్పన కోసం, ప్రత్యేకించి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టుబడి ఉందన్నారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన నిధులను, సాంకేతిక సహకారాన్ని కేంద్రం అందిస్తుందని వివరించారు.

## ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన

### ‘అలాంటి వాటిని రద్దు చేస్తాం’




తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సంగ్రామం షురూ అయ్యింది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక మొదటి రోజే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఏకగ్రీవాలు జోరందుకుంటున్నాయి. ఈ క్రమంలో సర్పంచులు, వార్డు మెంబర్ల ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. బలవంతపు ఏకగ్రీవ ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏకగ్రీవాల్లో పలు మోసాలు జరుగుతున్నాయని.. బలవంతంగా ఏకగ్రీవాలకు అంగీకరించేలా చేస్తున్నారని.. వేలం పాట ద్వారా ఏకగ్రీవాలు జరుగుతున్నట్లు ఈసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

2 లో

## కర్ణాటక సీఎం పీఠంపై సోనియా గాంధీ కీలక నిర్ణయం: నేడు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఢిల్లీకి?



2 లో

## పిన్నెల్లి సోదరులకు సుప్రీంలో చుక్కెదురు, ముందస్తు బెయిల్ రద్దు, రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం



2 లో

## హాంకాంగ్‌లో ఘోర అగ్నిప్రమాదం, 94కు చేరిన మృతుల సంఖ్య, 280 మంది ఆచూకీ గల్లంతు



2 లో

## పంచాయతీ ఎన్నికలు,జీవో 46 పై స్టేకు హైకోర్టు నిరాకరణ -యథావిధిగా ఎన్నికలు



2 లో

## సిగాచి ఫార్మా ప్రమాదం: రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం!



2 లో

## విద్యార్థి సంఘాల ‘ఛలో విజయవాడ’ రగడ, మంత్రి లోకేశ్ ఇంటి ముట్టడికి యత్నం - ఉద్రిక్తత



2 లో

## అల్లూరి జిల్లాలో వేల కోట్ల ‘విష’పు రవాణాకు బ్రేక్!



2 లో

## సంచలన ప్రకటన, జనవరి 1న మావోయిస్టుల సామూహిక ఆయుధ విరమణ! శాంతి చర్చలకు మార్గం సుగమం?






2 లో

# జనవరి 1న సరెండర్ అవుతాం

## MMC జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదల




2 లో

- మల్లోజుల-ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్ ప్రభావం
- సరెండర్ వరకు కూబింగ్ ఆపరేషన్లు ఆపాలన్న డిమాండ్
- ఎవరు ఎక్కువ సహకరిస్తే ఆ ప్రభుత్వ సమక్షంలోనే లొంగుబాటు
- మావోయిస్టులకు కొత్త ఆదేశాలు - హింసాత్మక చర్యలు నిషేధం
- రోజూ రేడియో కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ విడుదల
- మూడు రాష్ట్రాల భద్రతా దళాలకు అలర్ట్ - కేంద్రం సమీక్షలో పరిణామాలు

దండకారణ్యాల్లో భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ల మోత మోగుతున్న వేళ మావోయిస్టు పార్టీ నుంచి ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో మరో సంచలన లేఖ విడుదలైంది. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్‌ను కూడా విడుదల చేశారు. ఒక్కొక్కరు కాకుండా అంతా ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది బీజేపీ నేతలే..విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు



3 లో

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ నేతలేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పగటిపూట బీసీల గొంతు కోసిన బీజేపీ నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నది బీజేపీ నాయకులే, వీరు బీసీ ద్రోహులు, వెన్నుపోటు దారులని ఆరోపించారు.

## అమరావతికి ఆర్థిక శోభ:

### ఆర్బీఐ సహా 25 బ్యాంకుల భవనాలకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన



2 లో

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా శుక్రవారం ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ప్రాంతీయ కార్యాలయంతో పాటు 25 ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల నూతన భవనాలకు ఒకేసారి శంకుస్థాపన జరిగింది.

## పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం..

### తెలంగాణ హైకోర్టు సంచలన ఉత్తర్వులు



3 లో

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం నవంబర్ 22న జీవో నెం.46ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కలిపి రిజర్వేషన్లు మొత్తం 50 శాతం కంటే ఎక్కువ కాకూడదని ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో జీవో నెం.46 ప్రకారం చట్టవిరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయించారని, వెంటనే పంచాయతీ ఎన్నికలు నిలిపివేయాలని సవాలు చేస్తూ వెనుకబడిన కుల సంఘాలు వేర్వేరుగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఇవాళ వారి పిటిషన్లపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సర్కార్ విడుదల చేసిన జీవో నెం.46పై ఈ దశలో తాము స్టే ఇవ్వలేమని స్పష్టం చేశారు.

ఇరు పక్షాల వాదనల సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. సబ్ కేటగిరి రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఎన్నికలు రద్దు చేయాలని కోరుతున్నారా..? అని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు.

## దీక్షా దివాస్, తెలంగాణ ఉద్యమానికి పునరుజ్జీవనం

ఆర్టికల్





3 లో

## కర్ణాటక సీఎం పీఠంపై సోనియా గాంధీ కీలక నిర్ణయం: నేడు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఢిల్లీకి?

కర్ణాటక ముఖ్యమంత్రి పదవి విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరదించడానికి కాంగ్రెస్ అధినాయకత్వం సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా, ఈ కీలకమైన అంశంపై సోనియా గాంధీ దృష్టి సారించారు.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ముఖ్యమంత్రి పీఠం ఆశిస్తున్న మాజీ సీఎం సిద్ధరామయ్య, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్లలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తుది నిర్ణయాన్ని సోనియా గాంధీ తీసుకోనున్నారు.

ఇప్పటికే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు పలు దఫాలుగా చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా తుది నిర్ణయం సోనియా చేతుల్లో ఉంది.ఈ ముఖ్యమంత్రి ఎపిసోడ్‌లో భాగంగా, నేడు డీకే శివకుమార్ మరియు సిద్ధరామయ్యలను ఢిల్లీకి పిలిపించే అవకాశం ఉంది.

రేపు డీకే శివకుమార్‌తో రాహుల్ గాంధీ మరియు మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, ముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబడుతున్న డీకే శివకుమార్ ఇంట్లో నిన్నటి నుండి వరుస సమావేశాలు జరుగుతున్నాయి.

## పిన్నెల్లి సోదరులకు సుప్రీంలో చుక్కెదురు, ముందస్తు బెయిల్ రద్దు, రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం

పల్నాడు జంట హత్యల కేసులో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరియు ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది.గతంలో వారికి కల్పించిన మధ్యంతర రక్షణ ఉత్తర్వులను కూడా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. దీనితోపాటు, పిన్నెల్లి సోదరులు రెండు వారాల్లోగా న్యాయస్థానం ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరావుల జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులు ఏ6, ఏ7 నిందితులుగా ఉన్నారు.ఈ హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్ పొందే అర్హత ఏమాత్రం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణకు సహకరించాలని ఆదేశించినప్పటికీ, నిందితులు సాక్షులను బెదిరించి, సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. పోలీసుల విచారణకు సంబంధించిన సెక్షన్ 161 స్టేట్‌మెంట్లు నిందితులకు ఎలా అందాయని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేసు దర్యాప్తులో పోలీసుల నుంచి నిందితులకు పూర్తి సహకారం అందుతోందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసులో కస్టడీ విచారణ తప్పనిసరి అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిన్నెల్లి సోదరులు లొంగిపోయేందుకు తమ న్యాయవాదులు కోరిన విజ్ఞప్తి మేరకు.. లొంగిపోవడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పిన్నెల్లి సోదరుల అరెస్టుకు లైన్ క్లియర్ అయినట్లయింది.

## హాంకాంగ్‌లో ఘోర అగ్నిప్రమాదం, 94కు చేరిన మృతుల సంఖ్య, 280 మంది ఆచూకీ గల్లంతు

ఆసియా వాణిజ్య కేంద్రమైన హాంకాంగ్‌లో జరిగిన అతిపెద్ద అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిన్న రాత్రి జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో మృతుల సంఖ్య అనూహ్యంగా 94కు చేరింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రమాదంలో మరో 280 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలీస్టరైన్ బోర్డుల వల్లే తీవ్రత అధికం నగరంలోని రద్దీ ప్రాంతంలో ఉన్న ఒక బహుళ అంతస్తుల భవన సముదాయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు ఆకస్మికంగా చెలరేగి వేగంగా అన్ని అంతస్తులకూ వ్యాపించడానికి ముఖ్య కారణాన్ని అధికారులు గుర్తించారు. ఆ భవన నిర్మాణంలో, ముఖ్యంగా లోపలి విభజనల కోసం వినియోగించిన పాలీస్టరైన్ బోర్డుల వల్లే మంటల తీవ్రత ఊహించని విధంగా పెరిగిందని అధికారులు స్పష్టం చేశారు. ఈ పదార్థం మండే స్వభావం అధికంగా ఉండడం, వేగంగా కాలిపోవడం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కొన్ని బ్లాకుల్లో కొనసాగుతున్న మంటలు

ప్రమాదం జరిగిన భవనంలోని కొన్ని బ్లాకుల్లో మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని అగ్నిమాపక శాఖ వెల్లడించింది. దట్టమైన పొగ, అగ్నికీలల మధ్య సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు భవనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు, మృతదేహాలను వెలికితీసేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు.

పోలీసులు, అగ్నిమాపక దళం సిబ్బంది సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. భవనంలో చిక్కుకున్న వారిని గుర్తించి, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. ఆచూకీ తెలియని వ్యక్తుల కోసం వారి బంధువులు ఆందోళన చెందుతుండగా, సహాయక కేంద్రాల వద్ద తీవ్ర ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో విచారణ జరుపుతామని అధికారులు తెలిపారు.

## పంచాయతీ ఎన్నికలు,జీవో 46 పై స్టేకు హైకోర్టు నిరాకరణ యథావిధిగా ఎన్నికలు

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 46ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ దశలో ఎన్నికల ప్రక్రియపై స్టే విధించడానికి ధర్మాసనం నిరాకరించింది.ముఖ్య న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం... బీసీలలో సబ్–కేటగిరీ రిజర్వేషన్లు లేనందున ఎన్నికలను రద్దు చేయాలని కోరుకుంటున్నారా అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం తప్పనిసరి అయిన ఎన్నికల ప్రక్రియను ఆపలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోకూడదని రాష్ట్ర ఎన్నికల సంఘం అడ్వకేట్ వాదించారు.గతంలో 42 శాతం రిజర్వేషన్ జీవోపై విచారణ జరిగే సమయంలో, పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పామని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రస్తుతం అదే పద్ధతిలో ఎన్నికలు కొనసాగుతున్నాయని పేర్కొంది.ఈ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. సబ్–కేటగిరీ వర్గీకరణ లేకుండా జీవో 46 జారీ చేయడం వల్ల రిజర్వేషన్ల శాతం తగ్గిందని, జీవో 46ను రద్దు చేయాలని కోరుతూ మడివాల మచ్చదేవ రజకుల సంఘం తరఫున ఈ పిటిషన్ దాఖలైనట్లు సమాచారం.తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసిన హైకోర్టు, ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగేందుకు అనుమతి ఇచ్చింది.

## సిగాచి ఫార్మా ప్రమాదం: రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం!

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ప్రమాదంపై పోలీసులు జరుపుతున్న దర్యాప్తు తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 54 మంది ప్రాణాలు కోల్పోయిన ఇంతటి భారీ ప్రమాదంపై ప్రభుత్వం మరియు దర్యాప్తు సంస్థల నిర్లక్ష్యపు ధోరణిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తీవ్రంగా తప్పుబట్టారు.ఈ ఘటనపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (PIL)పై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం, దర్యాప్తు పురోగతిపై ప్రభుత్వ తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ (AAG)ను ప్రశ్నలతో నిలదీసింది.54 మంది చనిపోయిన ఇంత పెద్ద ఘటనపై ఇంత నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తారా?” అని ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగి ఇన్ని నెలలు గడుస్తున్నా “ఇంకా దర్యాప్తు పూర్తి కాలేదని చెప్పడం ఏంటి?” అని ప్రశ్నించారు.237 మంది సాక్ష్యాలను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?” అని నిలదీశారు.

ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయకపోవడంపైనా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై సీజే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈ కేసులో దర్యాప్తు ‘కొనసాగుతూనే ఉంది, కొనసాగుతూనే ఉంది’ అన్న ధోరణి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వ దర్యాప్తు తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన హైకోర్టు, ఈ కేసులో పారదర్శకత లోపించరాదని స్పష్టం చేసింది.తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి కోర్టులో ప్రత్యక్షంగా హాజరు కావాలని ధర్మాసనం ఆదేశించింది.దర్యాప్తు పురోగతిపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఏఏజీని ఆదేశించింది.దర్యాప్తు వేగవంతం చేసి, బాధితుల కుటుంబాలకు త్వరగా న్యాయం చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

## విద్యార్థి సంఘాల ‘ఛలో విజయవాడ’ రగడ, మంత్రి లోకేశ్ ఇంటి ముట్టడికి యత్నం - ఉద్రిక్తత

ద

విద్యారంగ సమస్యల పరిష్కారం, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఇతర హామీల అమలులో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మాట తప్పారని ఆరోపిస్తూ పలు విద్యార్థి సంఘాలు సంయుక్తంగా చేపట్టిన ‘ఛలో విజయవాడ’ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.విజయవాడ చేరుకున్న విద్యార్థి సంఘాల నేతలు, కార్యకర్తలు మంత్రి లోకేశ్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. ఈ ప్రయత్నాన్ని పోలీసులు ముందే పసిగట్టి వారిని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

మంత్రి నివాసం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పలువురు విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేసి, వ్యాన్లలో తరలించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (జీవో 77 రద్దు), యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీ, హాస్టల్ మెస్ ఛార్జీల పెంపు వంటి అంశాలపై మంత్రి లోకేశ్ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు.తమ డిమాండ్లపై మంత్రి లోకేశ్‌తో జరిగిన గత సమావేశం అసంపూర్తిగా ముగిసిందని, తమ సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని విద్యార్థి సంఘాల నేతలు ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఇచ్చిన మాట తప్పిన మంత్రి లోకేష్ డౌన్ డౌన్” అంటూ నినాదాలు చేశారు.

**ముఖ్య డిమాండ్లు:** పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసే జీవో నెం.77ను రద్దు చేయాలి.హాస్టల్ మెస్ ఛార్జీలను పెంచాలి (రూ. 3000 వరకు).విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వీసీ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి.

## అల్లూరి జిల్లాలో వేల కోట్ల ‘విష’పు రవాణాకు బ్రేక్!

రూ.3.80 కోట్ల విలువైన 760 కిలోల గంజాయి స్వాధీనం – ఐదుగురు అరెస్ట్, కారు సీజ్. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ఏజెన్సీ ప్రాంతం అక్రమ గంజాయి రవాణాకు అడ్డగా మారుతున్నదనే ఆరోపణలకు బలం చేకూరుస్తూ... అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి మండలం మరోసారి ఉలిక్కిపడింది. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్స్ దందాకు పోలీసులు భారీగా చెక్ పెట్టారు.దొరికిన రూ.3.80 కోట్ల విలువైన మాదకద్రవ్యం!పోలీస్ వర్గాలు అందించిన సమాచారం మేరకు, విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన పక్కా సమాచారంతో చింతపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా 760 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3 కోట్ల 80 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ భారీ పట్టివేత ఈ ప్రాంతంలో సాగుతున్న గంజాయి మాఫియా నెట్‌వర్క్ ఎంత పెద్దదో తెలియజేస్తోంది. పట్టుబడిన మొత్తం, 760 కిలోల గంజాయి అంచనా విలువ, రూ.3.80 కోట్లు.ఐదుగురు అరెస్టు.పోలీసులు గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారు ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు. ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? గంజాయిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? వీరికి అంతర్రాష్ట్ర డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ అరెస్టులతో అంతర్జాతీయ మాదకద్రవ్యాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని అధికారులు వెల్లడించారు. ఈ సంచలనాత్మక పట్టివేతపై మరింత లోతుగా విచారణ జరిపి, ఈ గంజాయి మాఫియా మూలాలను ఛేదించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సంచలన ప్రకటన, జనవరి 1న మావోయిస్టుల సామూహిక ఆయుధ విరమణ! శాంతి చర్చలకు మార్గం సుగమం?

మావోయిస్టు పార్టీ చరిత్రలో అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది జనవరి 1, 2026 న తాము సామూహికంగా ఆయుధాలను వీడి, జనజీవన స్రవంతిలో కలుస్తామని ప్రకటించింది. ఈ సంచలన ప్రకటన మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ (MMC) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో విడుదలైన లేఖలో వెల్లడైంది.ఒక్కొక్కరుగా కాకుండా, తమ కార్యకర్తలందరూ ఒకేసారి లొంగిపోతామని ప్రకటించడం అత్యంత సంచలనాత్మకం.మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్ వంటి పరిణామాలతో పార్టీ బలహీనపడటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు.తమకులి.369 భద్రతా హామీలు మరియు గౌరవప్రదమైన పునరేకీకరణ కల్పించాలని, అలాగే జనవరి 1 వరకు కూంబింగ్ ఆపరేషన్లను నిలిపివేయాలని మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) విజ్ఞప్తి చేశారు. సంప్రదింపుల కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ: ఈ నిర్ణయం గురించి తమ చెదిరిపోయిన కార్యకర్తలకు తెలియజేయడానికి, కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్‌ను కూడా ప్రకటించడం ఈ ప్రకటన తీవ్రతను తెలియజేస్తోంది.ఆయుధాలు పోరాటానికి అంతం కాదు, సరైన మార్గాన్ని ఎంచుకోవడానికి తీసుకునే నిర్ణయమని పేర్కొనడం ద్వారా శాంతి చర్చలకు మార్గం సుగమం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.దశాబ్దాల సాయుధ పోరాటానికి స్వస్తి చెప్పి, వేలాది మంది మావోయిస్టులు సామూహికంగా లొంగిపోవడానికి సిద్ధపడటం దేశ చరిత్రలో ఒక సరికొత్త మలుపుగా భావించవచ్చు. ప్రభుత్వాల ప్రతిస్పందనపైనే ఈ చారిత్రక పరిణామం విజయం ఆధారపడి ఉంది.

## జనవరి 1న సరెండర్ అవుతాం..

### MMC జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదల

మొదటి పేజీ తరువాయి

దీంతో మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించారు. కానీ ఈ లొంగుబాటు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు పరిధిలోని భద్రతా బలగాలు, పోలీసుల కూబింగ్ ఆపరేషన్లను నిలిపివేయాలని కోరారు. ఎక్కడా కూడా అరెస్టులు, బూటకు ఎన్‌కౌంటర్లు, దాడులు జరగకూడదని డిమాండ్ చేశారు. పెట్టిన గడవు వరకు ఆపరేషన్లు కొనసాగితే లొంగుబాట్ల ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడతాయని, చివరికి విఫలమవుతుందని పేర్కొన్నారు.

ఎవరు ఎక్కువ సహకారం ఇస్తే ఆ ప్రభుత్వం వెంటే..

గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సతీష్ దాదాతో పాటు మహారాష్ట్రలో సోనూ దాదా లాగా సీఎం లేదా హోంమంత్రి సమక్షంలోనే మా కామ్రేడ్స్ ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో చేరుతారని లేఖలో అనంత్ ప్రస్తావించారు. వచ్చే ఒక నెలలో ఈ మొత్తం ప్రక్రియను శాంతియుతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. లొంగుబాట్ల విషయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ సహకారం అందిస్తే ఆ రాష్ట్ర సీఎంతో పాటు హోంమంత్రి సమక్షంలోనే ఆయుధాలను అప్పగిస్తామని ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ ఇప్పటికే రేడియోలో 10 నుంచి 15 రోజుల సమయం కావాలని చెప్పిన మాటను గౌరవిస్తున్నామని, కానీ, జనవరి 1, 2026 తేదీలో ఎటువంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్స్‌ను మందు పెడతామని తెలిపారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి ఇంత వరకు స్పందన రాలేదని, ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నుంచి త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

కామ్రేడ్స్ హింస్మాత్మక చర్యలు వద్దు..

లొంగుబాట్లపై తేదీ ప్రకటించిన నేపథ్యంలో ఎంఎంసీ పరిధిలో మావోయిస్టు పార్టీ అగ్ర నేతల నుంచి కీలక ఆదేశాలు జారీ చేసినట్లుగా లేఖలో తెలిపారు. జనవరి 1 2026 వరకు ఎక్కడా ఎలాంటి హింసాత్మక చర్యలు చేపట్టొద్దని ఆదేశించామన్నారు. ఈ సంవత్సరం PLGA వారోత్సవాల దూరంగా ఉండాలని తెలిపినట్లుగా వెల్లడించారు. సరెండర్లపై రేడియో ద్వారా ఆడియో సందేశం విడుదల చేస్తామని అందరూ స్పష్టంగా విని, ఒకరితో ఒకరు కోఆర్డినేట్ చేసుకోవాలని సూచించినట్లుగా లేఖలో ప్రస్తావించారు.

కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్ విడుదల..

లొగుబాట్లకు సంబంధించి MMC జోన్ పరిధిలోని మావోయిస్టులకు రోజూ ఉదయం 11 నుంచి 11.15 వరకు రేడియో ఫ్రీక్వెన్సీ 435.715 MHz ద్వారా ఒకరితో ఒకరు సంప్రదించవచ్చని ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన లేఖను మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు రేడియోలో, జాతీయ మీడియాలో వెంటనే ప్రచురించాలని, తమ ఆడియో సందేశాన్ని కూడా అన్ని మీడియా సంస్థలు వార్తా సమయానికి ముందు ప్రసారం చేయాలని మావోయిస్టులు కోరారు.

తాజా పరిణామంతో మూడు రాష్ట్రాల భద్రతా దళాలు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అలర్ట్‌కు అయింది. సరెండర్లపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పటికే సానుకూల సంకేతాలు ఇవ్వగా.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## అమరావతిని అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: కేంద్రమంత్రి

మొదటి పేజీ తరువాయి

ఒకే ప్రాంతంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ)తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వంటి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన 25కు పైగా బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు కావడం అనేది అత్యంత అరుదైన, కీలకమైన ఘట్టంగా పేర్కొన్నారు. ఈ “ఫైనాన్షియల్ హబ్” కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు అన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పునాది అని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో అమరావతి ఒకటిగా నిలవడానికి ఈ పెట్టుబడులు దోహదపడతాయి అన్నారు. ఈ కేంద్ర కార్యాలయాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మారుస్తాయన్నారు.

ఈ బహుళ ప్రధాన కార్యాలయాల ఏర్పాటు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అమరావతి ఒక కేంద్రంగా మారుతుందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచుతుందని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇటీవల ఆర్థికంగా ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి, స్థిరమైన ప్రగతిని సాధించే దిశగా ప్రయాణించాలని కేంద్రం ఆకాంక్షిస్తోందన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులను సక్రమంగా, పారదర్శకంగా వినియోగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రం తీసుకునే ప్రతి ఆర్థిక నిర్ణయానికి కేంద్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ?ఈ శంకుస్థాపన కార్యక్రమం అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయమని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తును సాధిస్తుందని కేంద్రమంత్రి సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన ‘అలాంటి వాటిని రద్దు చేస్తాం’

మొదటి పేజీ తరువాయి

ఏకగ్రీవాలపై మార్గదర్శకాలు..




ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఏకగ్రీవాలకు సంబంధించి నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. వేలంపాట, బెదిరింపులతో ఏకగ్రీవం జరిగితే అది చెల్లదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (ఎన్నికల నిర్వహణ) చట్టం–2018లోని 15వ నిబంధన ప్రకారం.. ఒక స్థానంలో ఒక్క అభ్యర్థి పోటీలో ఉంటేనే.. దాన్ని ఏకగ్రీవంగా ప్రకటించాలి. అయితే ఇందుకోసం గ్రామంలోని ప్రజలను ప్రలోభపెట్టడం, ఇతర అభ్యర్థులను భయపెట్టడం, మోసం చేయడం వంటివి జరగకుండా చూసుకోవాలని సూచించింది. ఏకగ్రీవాలకు సంబంధించి ప్రతి జిల్లాలో ప్రత్యేక పర్యవేక్షక విభాగాలను నియమించాలని ఈసీ ఆదేశించింది. ఈ ప్రత్యేక పర్యవేక్షక విభాగాలు ఏకగ్రీవాలపై వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తాయి. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల కోసం వేలంపాట, ప్రలోభాలు, బెదిరింపులు, ఇతర మోసాలకు పాల్పడితే.. వాటి గురించి ప్రత్యేక పర్యవేక్షక విభాగాలకు ఫిర్యాదు చేయవచ్చు. ఇవి లిఖితపూర్వకంగా, మౌఖికంగా, వాట్సాప్, వార్తాపత్రిక క్లిప్పింగ్‌ల రూపంలో కూడా ఉండవచ్చని స్పష్టం చేసింది.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

వార్డు, సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయితే.. అభ్యర్థుల నుంచి తప్పకుండా ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు అభ్యర్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో, పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థి కూడా, తాను ప్రత్యర్థుల ఉపసంహరణ కోసం డబ్బులు ఇవ్వలేదని, వేలంపాటలో పాల్గొనలేదని, బెదిరింపులకు దిగలేదని ధ్రువీకరిస్తూ ఒక పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్ధారణ అయిన తర్వాత.. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే రిటర్నింగ్ అధికారులు నిర్దేశిత నమూనాలో ఎన్నిక పత్రాన్ని అందజేయాలి. అయితే ప్రత్యేక పర్యవేక్షక విభాగం నుంచి వచ్చిన నివేదికలను జిల్లా కలెక్టర్ పూర్తిగా పరిశీలించిన తర్వాతనే వీటిని డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. అలానే ఏకగ్రీవాలపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు లేకుంటేనే దాన్ని ఆమోదిస్తారు. ఈ ఫలితాల సమాచారంతో ఒక నివేదికను రూపొందించి.. దాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపాలి. ఏదైనా గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనట్లు గుర్తిస్తే.. ఆ గ్రామ ఏకగ్రీవ ఎన్నిక ఫలితాన్ని రద్దు చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులు వీటిని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

## అమరావతికి ఆర్థిక శోభ: ఆర్బీఐ సహా 25 బ్యాంకుల భవనాలకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి

అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభా వేదికపై ఈ బృహత్తర కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహా పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్బీఐతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ వంటి మొత్తం 25 అగ్రశ్రేణి జాతీయ, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల రాష్ట్ర స్థాయి కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన జరిగింది.

ఒకేసారి ఇన్ని ఆర్థిక సంస్థలు రాజధానిలో తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి సిద్ధమవడం, అమరావతిపై దేశ ఆర్థిక వ్యవస్థకు ఉన్న విశ్వాసాన్ని చాటుతోంది. ఈ పరిణామం రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయడంతో పాటు, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించనుంది.



ఈ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల కోసం సీఆర్డీఏ ఇప్పటికే ఉద్దండరాయపాలెం, రాయపూడి, లింగాయపాలెం, వేలగపూడి వంటి కీలక ప్రాంతాలలో సుమారు 62 ఎకరాల స్థలాన్ని కేటాయించింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు, కేంద్ర సహకారంతో అమరావతి ఆర్థిక శోభను సంతరించుకునే దిశగా ఈ శంకుస్థాపన కార్యక్రమం ఒక బలమైన పునాదిగా నిలవనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఈ సంస్థల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి, కార్యకలాపాలను ప్రారంభించాలని బ్యాంకుల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# దీక్షా దివాస్, తెలంగాణ ఉద్యమానికి పునరుజ్జీవనం

**నవంబర్ 29, 2009, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక అత్యంత ముఖ్యమైన మలుపు. ఈ రోజునే, తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు , తెలంగాణ సాధనే లక్ష్యంగా, ఆమరణ నిరాహార దీక్ష (దీక్షా దివాస్) ప్రారంభించారు. ఈ దీక్ష, దశాబ్దాలుగా మందగించిన ఉద్యమానికి ప్రాణం పోసి, తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా వేగవంతం చేసింది.**



**చారిత్రక నేపథ్యం:** తెలంగాణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమైనప్పటి (1956) నుండి తమ ప్రాంతీయ ఆకాంక్షలు, వనరులు, సంస్కృతి దెబ్బతింటున్నాయని భావించింది. 1969లో పెద్ద ఎత్తున తొలిదశ ఉద్యమం జరిగినా, అది లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించి ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించినప్పటికీ, 2009 నాటికి కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ఏర్పాటుపై స్పష్టమైన హామీ లభించలేదు. ఈ ప్రతిష్టంభనను ఛేదించడానికి, ఉద్యమాన్ని దేశవ్యాప్త దృష్టికి తీసుకురావడానికి, కేసీఆర్ దీక్షను ఒక తుది అస్త్రంగా ఎంచుకున్నారు.

**దీక్ష ప్రారంభం సృష్టించిన ప్రకంపనలు:** నవంబర్ 29, 2009న సిద్దిపేటలోని తన నివాసం నుంచి కరీంనగర్ వరకు "తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో పాదయాత్రగా వెళ్ళి, అక్కడ దీక్ష చేపట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు.కేసీఆర్ దీక్షా స్థలికి చేరుకోకుండానే కరీంనగర్ జిల్లా అలగునూర్ వద్ద పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అరెస్ట్‌కు నిరసనగా, ఖమ్మం ఆస్పత్రిలోనే ఆయన ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ అనూహ్య పరిణామం యావత్ తెలంగాణ అంతటా ఆగ్రహావేశాలకు కారణమైంది.



**ఉద్యమ జ్వాల, ప్రజా స్పందన:** దీక్ష ప్రారంభమవడంతోనే తెలంగాణ ప్రాంతమంతా ఒక్కసారిగా భగ్గుమంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ), కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) సహా అన్ని విద్యా సంస్థల విద్యార్థులు పోరాటంలో అగ్రగామిగా నిలిచారు. వేలాది మంది రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.ఉద్యోగులు, కార్మికులు, లాయర్లు, డాక్టర్లు, ఆర్టీసీ సిబ్బంది తమ వృత్తులను పక్కనపెట్టి ఉద్యమంలో భాగమయ్యారు.కేసీఆర్ దీక్షకు మద్దతుగా వందలాది మంది యువత, విద్యార్థులు తమ ప్రాణాలను బలిదానం చేసుకున్నారు. ఇది ఉద్యమానికి భావోద్వేగ తీవ్రతను పెంచింది. జాతీయ మీడియా ఈ పరిణామాలను నిశితంగా గమనించింది, తద్వారా తెలంగాణ సమస్య జాతీయ రాజకీయాల అజెండాలో చేరింది.

**దీక్ష విరమణ మరియు కేంద్రం ప్రకటన:** సుమారు 11 రోజుల పాటు దీక్ష కొనసాగింది. కేసీఆర్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించడంతో తెలంగాణ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరిగాయి. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని భావించిన అప్పటి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9, 2009న ఒక చారిత్రక ప్రకటన చేసింది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత, కేసీఆర్ తన నిరాహార దీక్షను విరమించారు.

ఈ ప్రకటన మొదటి అడుగు మాత్రమే అయినప్పటికీ, ఇది తెలంగాణ ఏర్పాటు దిశగా కేంద్రం వేసిన తొలి అధికారిక అడుగు కావడంతో, ప్రజలు దీన్ని గొప్ప విజయంగా భావించారు.

**దీక్షా దివాస్ ప్రాముఖ్యత:** దీక్షా దివాస్ అనేది కేవలం ఒక వ్యక్తి ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన రోజు మాత్రమే కాదు,తెలంగాణ సమాజం మొత్తం కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ఏకమై పోరాడితే విజయం సాధించవచ్చని నిరూపించింది. మందగించిన ఉద్యమానికి పునరుజ్జీవనం కల్పించి, తుది లక్ష్యం వైపు దూసుకుపోయే శక్తిని అందించింది.లక్ష్య సాధన కోసం ప్రాణాలొడ్డిన వీరుల త్యాగాలను స్మరించుకునే రోజు ఇది.ఈ రోజు, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవ పోరాట పటిమను, ఆత్మబలాన్ని గుర్తుచేస్తూ, రాష్ట్ర సాధన చరిత్రలో దీక్షా దివాస్ ఒక శాశ్వతమైన స్థానాన్ని పొందింది.



# సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే

## పూలే ఆశయాలను కొనసాగించాలి



తొర్రూరు, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో ఉన్న పూలే విగ్రహానికి విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా దళిత రత్న గుండాల నరసయ్య మాట్లాడుతూ మొదటి సామాజిక విప్లవకారుడు మహాత్మా పూలే అని ఆయన ఆశయాలను నేటి తరం యువత కొనసాగించాలని అన్నారు అందంతో శతాబ్దంలో జ్యోతిరావు పూలే సమకాలిన కుల లింగ వివక్షలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం భారత సామాజిక చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచింది 1827 మహారాష్ట్రలోని గోవిందరావు చిన్నబ్బాయి దంపతులకు జన్మించిన పూలే విద్యార్థి దశ నుండే చురుకుగా ఉండేవాడు తన బ్రాహ్మణ మిత్రుని ఆహ్వానం మేరకు పెళ్లి ఊరేగింపులో పాల్గొనగా అతనిని పక్కకు నెట్టివేసి కులం పేరుతో అవమానిస్తారు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక ఈ వ్యవస్థను మార్చాలని మూఢవిశ్వాసాలను సాంఘిక దురాచారాలను కట్టుబాట్లను పారదొరాలని బ్రాహ్మణ వ్యవస్థపై పోరాటం కొనసాగించిన సామాజిక విప్లవకారుడు పూలే దినంతటికీ చదువు శూద్రులకు లేకపోవడమేనని గ్రహించి అందరికీ చదువు నేర్పించాలని ఒక సంకల్పంతో మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేశారు తన భార్య అయిన సావిత్రికి చదువు చెప్పి మొదటి మహిళా టీచర్ గా మహిళా పాఠశాలను ఏర్పాటు చేశారు సతీసహగమనం సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు స్త్రీల విద్య కోసం కృషి చేశాడు సత్యశోధక్ అనే పత్రికను స్థాపించి దాని ద్వారా సమాజంలో జరిగే అన్యాయాలపై గళం విప్పి వెనుకబడిన అణగారిన వర్గాలకు చేయూతనందించాడు దేవాలయాల స్థానంలో బడులను నిర్మించాలని తద్వారా అందరికీ విద్య అందుతుందని తద్వారా సమాజం మార్పు చెందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో సమావేశ నిర్వహణ అధ్యక్షులు జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత రాయిశెట్టి ఉపేందర్ మాదిగ మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి రాయిశెట్టి వెంకన్న మున్సిపల్ మాజీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య న్యూ డెమోక్రసీ మాస్ లైన్ కార్యదర్శి కొత్తపల్లి రవి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్ మేకల కుమార్ డాక్టర్ రామ నర్సయ్య పూర్ణచందర్ బీసీ జేఏసీ నాయకులు డొనుక ఐలయ్య అల్లా బాబు కుమారస్వామి సుధాకర్ మంగళపల్లి ఆశయ పెండెం రమేష్ జాటోత్ సురేష్ దళిత ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరుల ని ఆశీర్వదించిన కాంగ్రెస్ సీనియర్ నేత పెదగాని సోమయ్య



తొర్రూరు, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పట్టణ వాస్తవ్యులు మాలోత్ మంగమ్మ -మంచియా నాయక్ దంపతుల ప్రథమ పుత్రుడు రాకేష్ ,మాధురి ల వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమన్న ఈ కార్యక్రమంలో నాయకులు చాపల బాపు రెడ్డి , మంగళపల్లి రామచంద్రయ్య గమరియు పరుపాటి రామ్మోహన్ రెడ్డి దంపతులు తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన పిఏసీఎస్ చైర్మన్



పెద్ద వంగర, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలో ని పోచంపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి సతీష్ రేణుకల నూతన గృహప్రవేశానికి హాజరైన పిఎసిఎస్ చైర్మన్ ,డిసిసిబి జిల్లా డైరెక్టర్ కాకిరాలహరి ప్రసాద్,తొర్రూరు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు మల్లేశం గౌడ్,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు పెద్ది ప్రవీణ్ గౌడ్,పిఎసిఎస్ డైరెక్టర్ కుమారస్వామి తదితరులు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది బీజేపీ నేతలే విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందన్నారు. తాము పంపిన బిల్లులను ఆమోదించకుండా బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడ్డుపడటం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకుండా నోరు మూసుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడు రేవంత్ రెడ్డిపై ఎగిరెగిరి పడుతుండటం హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కు కనీసం సిగ్గు అనిపించడం లేదా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆయన కూడా సీఎంపై ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చి.. ఢిల్లీలో మాట మార్చింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. బీసీలకు తీరని అన్యాయం చేసింది బీజేపీనే అని అన్నారు. ఢిల్లీ లో బీసీ బిల్లులను ఆమోదించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకత్వం జంతర్ మంతర్ దగ్గర ధర్నాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు కాశాయని అన్నారు. బీజేపీ ద్రోహాలను బీసీలు గమనించి సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీసీ బిడ్డ అని చెలామణి అవుతున్న లక్ష్మణ్.. ఆ బీసీలకే తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మణ్.. బీసీ బిల్లు ఆమోదించాలని ప్రధాని మోదీ పై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదన్నారు. తన పదవి పైన తప్ప బీసీలపైన ఇసుమంత ప్రేమ కూడా లక్ష్మణ్‌కు లేదన్నారు. గాంధీ కుటుంబం గురించి ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ప్రధాని పదవినే త్యాగం చేసిన చరిత్ర వాళ్లదని అన్నారు. ఎప్పటికైనా తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు సాధించేది కాంగ్రెస్ పార్టీనే అని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

## పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం.. తెలంగాణ హైకోర్టు సంచలన ఉత్తర్వులు

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండదని ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించగా ఆ మాటతో ధర్మాసనం కూడా ఏకీభవించింది. అనంతరం చీఫ్ జస్టిస్ రియాక్ట్ అవుతూ.. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు చేపట్టాలని చెప్పాం కదా అని కామెంట్ చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## లైన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు విజయవంతం



తొర్రూర్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): తొర్రుర్ లోని విశ్రాంతి భవనం వద్ద 80 మందికి బీపీ మరియు షుగర్ పరీక్షలు నిర్వహించడం, అన్నారం క్రాస్ రోడ్డు వద్ద ధరావత్ విమల, కృష్ణ కుమారుడు జయప్రకాష్ నారాయణ్ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం, మరియు తోరూర్ పిహెచ్సి సెంటర్లో లయన్ డాక్టర్ మిరాజ్ ఆర్థిక సహకారంతో గర్భిణీ స్త్రీలకు అన్నదాన కార్యక్రమం పండ్ల పంపిణీ కార్యక్రమం, మరియు సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ లైన్ డాక్టర్స్ నాగవాణి, లయన్ శారద చే గర్భిణీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ టి.ఎల్.టి కోఆర్డినేటర్ లైన్ డాక్టర్ వేలూరు శారద , మైక్రో క్యాబినెట్ నెంబర్ లయన్ రేవూరి వెంకన్న, లైన్ నాగవాణి, లయన్ విమల, లైన్ ఉమా రెడ్డి, లైన్ డాక్టర్ మిరాజ్ , డాక్టర్ నందిని ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## సామాజిక దార్శనికుడు - మహాత్మా జ్యోతిరావు పూలే

### ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్



నెల్లికుదురు, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): సమానత్వం, విద్య, సామాజిక న్యాయానికి మహాత్మా జ్యోతిరావు పూలే దార్శనికుడని ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఇన్చార్జి ప్రిన్సిపల్ బండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు ప్రభుత్వ జనరల్ కళాశాల నెల్లికుదురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలరేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్, ఇన్చార్జి ప్రిన్సిపల్ బండి శ్రీనివాస్ లు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు విద్యా హక్కు, మహిళలకు స్వేచ్ఛ, బహుజనులకు ఆత్మగౌరవం అనే విలువలను స్థాపించిన మహోన్నత సంస్కర్త పూలే నని, 1848లో సావిత్రీబాయితో కలిసి స్థాపించిన బాలికల పాఠశాల భారత చరిత్రలో తొలి విద్యా విప్లవమని, మహిళా శక్తివంతీకరణకు ఆయన వేసిన బాట నేటికీ మార్గదర్శకమని అన్నారు. 1873లో ఏర్పాటు చేసిన సత్యశోధక సమాజం ద్వారా కులవ్యవస్థలోని అన్యాయాలను ప్రశ్నించి సమానత్వాన్ని బలపరిచారని, రైతులు, కార్మికులు ఎదుర్కొన్న దోపిడీని వెలుగులోకి తెచ్చి వారి హక్కుల రక్షణకు కృషి చేశారని తెలిపారు. వితంతువుల పునర్వివాహం, బాల్యవివాహాల నిర్మూలన, శిశుహత్యల నివారణ వంటి అంశాల్లో ఉద్యమించారని అన్నారు. సమాజంలోని శుద్ర-అతిశూద్రులకు గౌరవం, హక్కులు అందించడానికి చేసిన కృషి భారత సామాజిక చరిత్రలో శాశ్వత గుర్తింపు పొందిందని, నేటి సమానత్వం, విద్య, స్త్రీ సాధికారత, సామాజిక న్యాయం వంటి అంశాలకు పూలే సిద్ధాంతాలు మూలస్తంభమని తెలిపారు. పూలే ఆశయాలు సమాజాన్ని సమానత్వం వైపు నడిపే శక్తి అని ,ఆయన చూపిన దారిలో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించడానికి పునరంకితం కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దేశెట్టి యాకన్న, కూన సతీష్ అధ్యాపకేతర బృందం ప్రదీప్, లక్ష్మణ్ గౌరీ, శంకర్ లు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మంత్రి గుమ్మడి సంధ్యారాణి పీఏస్ సతీశ్ రాజీనామా



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): మంత్రి గుమ్మడి సంధ్యారాణి పీఏస్ సతీశ్ రాజీనామా చేశారు. ఆయనపై లైంగింక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తాయి. అటు మంత్రి గుమ్మడి సంధ్యారాణిపైనా విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సతీశ్ రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తన రాజీనామా లేఖను పంపారు.

కాగా కారుణ్య నియామకాల విషయంలో తనను మంత్రి పీఏస్ సతీశ్ వేధించినట్లు విజయనగరం జిల్లాకు చెందిన ఓ మహిళా ఉద్యోగిని ఆరోపించారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె వాపోయారు. దీంతో సతీశ్ రాజీనామాపై పలు సంఘాల నుంచి డిమాండ్ వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం రాజీనామా చేశారు.

## అల్లూరి జిల్లాలో రూ.3.80 కోట్ల గంజాయి పట్టివేత



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో నేడు పోలీసులు భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 760 కిలోల గంజాయి విలువ సుమారు రూ.3.80 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒడిస్సా సరిహద్దులోని చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా.. గంజాయి రవాణాకు వాడిన కారును సీజ్ చేశారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ ముఠా గుట్టు రట్టయింది.

ఒడిస్సా-ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైదరాబాద్, విజయవాడ తదితర నగరాలకు గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ ముఠాలో ఉన్నది ఒడిస్సా-ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వ్యక్తులే అని అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారని సమాచారం.

## వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తుల పోటీ.. అసలు మహాత్యం ఏంటంటే?




తిరుమలలో ఉత్తర ద్వారా దర్శనానికి సంబంధించిన టికెట్లను టీటీడీ గురువారం విడుదల చేసిన విషయం తెలిసిందే. డిసెంబర్ 30, 31 జనవరి 1 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఆన్‌లైన్‌లో పేర్ల నమోదుకు విశేష స్పందన లభిస్తోంది. గురువారం రిజిస్ట్రేషన్ ప్రారంభం కాగా సాయంత్రానికి 4.60 లక్షల మంది నమోదు చేసుకున్నారు. భక్తులు డిసెంబర్ 1 వరకు టీటీడీ వెబ్‌సైట్, టీటీడీ యాప్ లేదా 9552300009 వాట్సాప్ నెంబర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో ఎంపికైన వారికి డిసెంబర్ 2న మెసేజ్‌లు పంపుతారు.

వైకుంఠ ద్వార దర్శనం ఎంత పుణ్యమంటే?

వైష్ణవాలయాల్లో ఏడాది పొడవునా మూసి ఉండే ఉత్తర ద్వారాలు వైకుంఠ ఏకాదశి నాడు తెరుచుకుంటాయి. ఈ ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే స్వర్గంలోకి ప్రవేశించినంత పవిత్రంగా భావించి, పాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. శ్రీవారి దర్శనార్థం 3 కోట్ల దేవతల రాకకు చిహ్నంగా వీటిని తెరుస్తారు. అందుకే ఇంతటి మహిమ గల వైకుంఠ ద్వారా దర్శనం కోసం భక్తులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో టీటీడీ గురువారం తేదీలను ప్రకటించడంతో వైకుంఠ ద్వారా దర్శనానికి తిరుమల భక్తులు అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.

## పవన్ కల్యాణ్ పర్యటనల్లో అపరిచిత వ్యక్తి.. ఎస్పీకి ఫిర్యాదు



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల కాలంలో వరుసగా జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. దీంతో ఆయనను చూసేందుకు పార్టీ కార్యకర్తలే కాదు.. అనుచిత వ్యక్తులు సైతం వస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు సమీపంలో కనిపించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఓ వ్యక్తి బ్లేడుతో తన చేతులు కోసేశారంటూ పవన్ కల్యాణే చెప్పడం అప్పట్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే.


అయితే అలాంటి ఘటనకాకపోయినా రాజోలు పర్యటనలో పవన్ కల్యాణ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. కొబ్బరి రైతుల కష్టాలు తెలుసుకునే సమయంలో ఓ అపరిచిత వ్యక్తి చొరబడినట్లు గుర్తించారు. అంతేకాదు పవన్ కల్యాణ్‌కు దగ్గరగా సంచరించినట్లు కోనసీమ జిల్లా ఎస్పీకి జనసేన కార్యాలయం సిబ్బంది ఫిర్యాదు చేసింది. అపరిచిత వ్యక్తి ఓ పార్టీకి చెందినట్లు గుర్తించారు. ఆయన కదిలికలు, కార్యక్రమానికి జారీ చేసిన పాస్‌పైనా సందేహాలున్నట్లు ఎస్పీకి వివరించారు. దీనిపై విచారణ చేపట్టాలని ఎస్పీని కోరినట్లు పేర్కొన్నారు.

## అమరావతికి రూ.7,500 కోట్ల రుణం.. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): అమరావతి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. రూ. 7,500 కోట్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎన్ఏబీఎఫ్ఐడీ నుంచి రుణం తీసుకోవాలని సీఆర్డీఏ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 7,500 కోట్లు తీసుకునేందుకు హామీ ఇచ్చింది. అలాగే ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఎన్ఏబీఎఫ్ఐడీ నుంచి తీసుకున్న రుణాన్ని రాజధాని అమరావతి అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలనే నిబంధన పెట్టింది. తదుపరి చర్యలు చేపట్టాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అనంతపురంలో దారుణం.. డిప్యూటీ తహసీల్దార్ భార్య, కుమారుడు మృతి



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): అనంతపురం జిల్లాలో దారుణం జరిగింది. రామగిరి డిప్యూటీ తహసీల్దార్ కుమారుడు, భార్య అనుమానాస్పదంగా మరణించారు. కుటుంబ కలహాల కారణంగా కుమారుడిని చంపి ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు.

కర్నూలు జిల్లా తాడిమర్రికి చెందిన రవి అనంతపురం జిల్లా రామగిరి డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఐదేళ్ల క్రితం అమూల్య అనే మహిళతో వివాహమైంది. వీరికి మూడున్నర ఏళ్ల కుమారుడు సహర్ష ఉన్నాడు. అనంతపురంలోని శారదా నగర్‌లో కుటుంబంతో రవి ఉంటున్నాడు. అయితే గురువారం ఉదయం రవి డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చి తలుపు కొట్టగా.. ఎంతకీ తలుపు తీయలేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని అమూల్య కనిపించింది. మంచంపై రక్తపు మడుగులో కుమారుడి మృతదేహం ఉంది.

కాగా, కుటుంబ కలహాల కారణంగానే అమూల్య ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ విషయం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతురాలు అమూల్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. అమూల్య నిజంగానే ఆత్మహత్య చేసుకుందా? లేదా హత్య చేశారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. పూర్తిగా దగ్ధం అయిన లారీ



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దకడబూరు మండలం పులికనుమ బస్టాండ్ దగ్గర బండల లోడుతో వెళుతున్న లారీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లారీ పూర్తిగా కాలిపోయింది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్ బయటకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురైన లారీ తాండూరు నుండి కేరళకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఇక ఇదే నెలలో కర్నూలు జిల్లాలో ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై మంటలు చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 19మంది మరణించారు. ఆ తరవాత కూడా జిల్లాలో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

## గంజాయి బ్యాచ్ హల్ చల్.. మహిళల పట్ల అనుచిత ప్రవర్తన



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): ఈ మధ్యన గంజాయి బ్యాచ్ మితిమీరిన ఆగడాలకు పాల్పడుతోంది. విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారు. కొందరైతే ఆయుధాలతో దౌర్జన్యం చేస్తున్నారు. రోడ్డుపై కొందరిని అడ్డగించి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు అల్లరికమూకలపై మాత్రం సాదాసీదాగా వ్యవహరిస్తున్నారు. గంజాయి సేవించి వీధుల్లో రచ్చ చేస్తున్న యువకుల పట్ల ఉదాసీనతను చూపుతున్నారు. దీంతో గంజాయి బ్యాచ్ హల్ చల్ చేయడం విచ్చలవిడిగా మారింది.

తాజాగా కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడిలో గంజాయి బ్యాచ్ హల్ చల్ చేసింది. గంజాయి, మద్యం సేవించి ఇద్దరు యువకులు రెచ్చిపోయారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఈ వీడియోలను పలువురు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ మేరకు వైరల్ కావడంతో పోలీసులు యువకులపై కేసు నమోదు చేశారు. యువకుల కోసం గాలిస్తున్నారు. మరోవైపు గంజాయి బ్యాచ్‌ల తీరుపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోంది. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గంజాయి బ్యాచ్‌పై నిఘా పెట్టాలని, కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

## తిరుపతి జిల్లాలో నకిలీ సీఐ హల్ చల్



ఏపీ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): తిరుపతి జిల్లాలో ఓ నకిలీ సీఐ హల్ చల్ చేసిన ఘటన వెలుగు చూసింది. ఏకంగా పోలీసు స్టేషనులోనే హంగామా చేయడంతో అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో అతని అసలు గుట్టు బయటపడింది. నిందితుడు గతంలో రెడ్ శాండిల్ కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. ఇక పోలీసుల వివరాల ప్రకారం తాను రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేస్తున్నానంటూ శివయ్య అనే వ్యక్తి ప్రజలను బెదిరింపులు, సెటిల్‌మెంట్ల పేరుతో మోసం చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. అన్నమయ్య జిల్లాకు చెందిన శివయ్య పోలీసు అధికారిగా చలామణి అవుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

?తాజాగా చినగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లిలో ఓ జంట మధ్య రాజీ కేసులో శివయ్య జోక్యం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా పోలీస్ స్టేషన్‌లోనే హంగామా సృష్టించాడన్నారు. తాను రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ సీఐనని చెప్పుకుంటూ అక్కడున్నవారిని బెదిరించాడని పోలీసులు పేర్కొన్నారు. అయితే అతని ప్రవర్తన, మాటతీరుపై అనుమానం వచ్చిన స్థానిక పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. ?విచారణలో శివయ్య నిజంగా సీఐ కాదని, నకిలీ అధికారి అని తేలిందన్నారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితుడు అన్నమయ్య జిల్లా, కలకడ మండలం, పెద్దకమ్మపల్లి వాసిగా గుర్తించామన్నారు.

సీఐగా నటిస్తున్న శివయ్యపై గతంలో కూడా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా కే.వి.పల్లి పోలీస్ స్టేషన్‌లో రెడ్ శాండిల్ కేసు నమోదై ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతను రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ సీఐగా చెప్పుకుంటూ గతంలో పలు సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ నకిలీ అధికారిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతనిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

అధికారులుగా నటించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని.. ఎటువంటి సందేహాలున్నా పోలీసులను సంప్రదించాలని కోరారు. ఎవరైనా పోలీసుల పేరిట బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# ఉపాధ్యాయ సేవలకు ఘన వందనం

## షేక్ మహమూద్ ఉద్యోగ విరమణ సన్మాన సభ



మరిపెడ, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): మండలంలోని చిల్లంచర్ల గ్రామ పరిధిలోని మాంచ్య తండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షేక్ మహమూద్ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం చిల్లంచర్ల ఉన్నత పాఠశాలలో శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ ఉద్యోగ విరమణ అభినందన సభలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిల్లంచర్ల ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కవిత మాట్లాడుతూ షేక్ మహమూద్ తన ఉద్యోగ జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని, విద్యార్థులకు చేసిన సేవలు వెలికట్టలేవని, మంచి ఉపాధ్యాయునిగా ఆయన పనిచేసిన పాఠశాలాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న ఎల్లంపేట కాంప్లెక్స్ హెచ్ఎం భాస్కర రావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగులకు సర్వసాధారణం అయినప్పటికీ , ఉపాధ్యాయులు విద్యార్థుల కు మరియు పాఠశాలలకు చేసిన సేవలు వెలకట్టలేని, షేక్ మహమూద్ విషయ నిపుణునిగా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారు అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు షేక్ మహమూద్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా 30 సంవత్సరాలు పనిచేసి, విద్యా బోధనలో విద్యార్థుల మధ్య గడిపిన జీవితం ఏనాటికి మరవరాదని, ఈ ఉపాధ్యాయ జీవితం ఎంతో సంతృప్తి ఇచ్చిందని, నేను బోధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడం తనకు సంతృప్తినిచ్చిందని, నేను ఈ ఉద్యోగ జీవితంలో 30 సంవత్సరాల పాటు పనిచేయడానికి కారణం తన కుటుంబ సభ్యులు అని అన్నారు . ఈ ఉద్యోగ విరమణ సందర్భంగా చిల్లం చర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నా ఆప్త మిత్రుడు చింతల సురేష్ మానస ఆర్థిక సహకారంతో అల్పాహారానికి కావలసిన ముడి సామాగ్రిని అందజేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఏ పీ సీ చైర్మన్ మాధవి, ఉపాధ్యాయ సంఘ నాయకులు గుర్రం వెంకన్న, హఫీజర్, మంగు, ఉపాధ్యాయులు నరహరి, తేజస్విని, సామ్సన్ సుధాకర్, శ్రీనివాస్, చింతల సురేష్ , రామయ్య, తోట రమేష్ పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్దే నా లక్ష్యం

## పెద్దమందడి బిఆర్ఎస్ అభ్యర్థి టి.భాగ్యలక్ష్మి





వనపర్తి, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పెద్దమందడి గ్రామపంచాయతీ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా టి. భాగ్యలక్ష్మి శుక్రవారం మొదటి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్న్ అధికారికి సమర్పించారు.వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పోటీ చేస్తున్నానని గ్రామ ప్రజలందరికీ ఎప్పుడు అందుబాటులో ఉంటానని గ్రామంలో ఉన్నటువంటి సౌకర్యాలను శుభ్రత, రహదారులు,డ్రైనేజీలు అభివృద్ధి వంటి మరిన్ని అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటారని తెలిపారు.మీ ఆశీస్సులతో దీవించాలని అభివృద్ధిశగా పనిచేస్తానని వారు అన్నారు.ఈ కార్యక్రమం లో సేనాపతి,జంగం రమేష్,పురుషోత్తం రెడ్డి, సింగిరెడ్డి కురుమూర్తి, సూర శ్రీనివాసులు, గోవర్ధన్ రెడ్డి, మొగులయ్య,కొమ్ము బ్రహ్మయ్య,కొమ్ము విష్ణు, శివకృష్ణ,సింగిరెడ్డి వెంకటస్వామి,ఎం వినోద్ కుమార్,గుడిసె మల్లేష్,చైతన్య,బి ఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించిన నంద్యాల మోహన్ గురు స్వామి





కుత్బుల్లాపూర్ , 28 నవంబర్ (క్రాంతి న్యూస్): సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ పోచమ్మ టెంపుల్ బ్యాక్ సైడ్ వీధిలో నంద్యాల మోహన్ గురుస్వామి, వారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అర్చన లు పులాబీషేకం,పాలాభిషేకం, నెయ్యి అభిషేకం, అదేవిదంగా బాలు, భజన బృందంతో ప్రత్యేక అయ్యప్ప స్వామి పాటలతో అలరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నంద్యాల మోహన్ గురుస్వామి, శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పలు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# శారీరక,మానసిక,మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికే యోగ

**- ఉచిత హెూమియో వైద్య యోగా శిబిరము**

**-శారీరక దృఢత్వంను మరియు వశ్యతను పెంచుతూ!ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది**



హనుమకొండ, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): టీచర్స్ కాలనీ ఫేస్ 1వడ్డేపల్లి లో గవర్నమెంట్ ఆయుష్ డిపార్ట్మెంట్ హనుమకొండ ఆర్ డి డి ప్రమీల దేవి ఆదేశాల మేరకు ఉచిత హెూమియో వైద్య యోగ శిబిరము హన్మకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాను కుమార్ గవర్నమెంట్ ఆఫ్ హెూమియో డిస్పెన్సరీ వడ్డేపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రజిత యోగ ఇన్స్ట్రక్టర్ రాము లత ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీచర్స్ కాలని వాసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత హెూమియోపతి మందులను పంపిణీ చేశారు.అలాగే యోగ ప్రాముఖ్యత పై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించి యోగ ధైనందిన జీవితంలో అభ్యసనం గూర్చిన శిక్షణను అందించారు.ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి డాక్టర్ మల్లిక డాక్టర్ పుల్లయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు చేయొద్దు
- అభ్యర్థుల పత్రాల సమర్పణపై అవగాహన కల్పించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- పెద్దేముల్, యాలాల మండలాల్లోని క్లస్టర్ల పరిశీలన



వికారాబాద్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పంచాయతి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తాండూరు నియోజకవర్గం పెద్దేముల్, యాలాల మండలాల్లోని పంచాయతీ ఎన్నికల క్లస్టర్లను సందర్శించారు. ఆయా కేంద్రాలలో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో అభ్యర్థుల నుంచి కావాల్సిన పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. నామినేషన్ల పత్రాలు స్పష్టంగా పరిశీలించుకునేలా అభ్యర్థులకు సహకరించాలని అన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతా ఉండేలా చూసుకోవాలన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు నిబంధనలకు అనుగుణంగా ఖర్చులు పెట్టాలనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సమయానికి అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు రతన్ సింగ్, శ్రీనిజ, ఆర, ఏఆర్ఓలు తదితరులు ఉన్నారు.

# వెల్టూర్ ని "వెలుగు"దిశగా అభివృద్ధి చేస్తా

## వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా వడ్డే శేఖర్ నామినేషన్



వనపర్తి, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): వెల్టూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వడ్డే శేఖర్ శు క్రవారం మొదటి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.వడ్డే శేఖర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పోటీ చేస్తున్నానని,ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. శు భ్రత,నీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని స్పష్టం చేశారు.ఈ ఎన్నికల్లో మీ అందరి ఆశీస్సులు, మద్దతు నాకు అత్యంత అవసరం అని గ్రామ అభివృద్ధి కోసం,వెల్టూర్ కు మరింత మంచి రోజులు తీసుకురావడానికి నన్ను సర్పంచ్ గా గెలిపించాలని గ్రామ ప్రజలను కోరుతున్నాను.మీ నమ్మకానికి తగిన విధంగా పని చేసి, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తాను అని వడ్డే శేఖర్ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచినందుకు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



ఇనుగుర్తి, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): సామాజిక విప్లవకారుడు, ఆధునిక యుగ వైతాళికుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే 135 వర్ధంతి వేడుకను ఇనుగుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, రాజకీయ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి గ్రామ సర్పంచ్ గా గెలిపించండి

**ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తా**

**సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన సుర గంగమ్మ**



వనపర్తి, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పెద్దమందడి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నుకుంటే కుల మత వర్గ విభేదాలు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి పని చేస్తానని పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుర గంగమ్మ అన్నారు. శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు వేశారు.అనంతరం సూర్య గంగమ్మ మాట్లాడుతూ... గ్రామంలో చాలా అభివృద్ధి పనులు ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహాయంతో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించమని రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖల ద్వారా గ్రామ అభివృద్ధికి సంబంధించిన నిధులతో పాటు స్థానిక ఎమ్మెల్యే నిధులతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఐ.సత్య రెడ్డి,మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి,మాజీ సర్పంచ్ వెంకటస్వామి,మాజీ జెడ్పిటిసి వేణుగోపాలకృష్ణ,పుల్లన్న యాదవ్,ఉషన్న,బుచ్చన్న, వహీద్,తన్వీర్ అహ్మద్,రవి, రామాంజనేయులు,స్వామి, హనుమతు,కాంగ్రెస్ పార్టీ కార్యాకర్తలు తదితరులు పాలుగోన్నారు.

# ఎన్నికలు లేకుండా గెలిపించండి..!

**అలా చేస్తే రూ. 30లక్షలు ఇస్తా**


**పెద్దెముల్ మండలంలో యువకుడి సంచలన ప్రకటన**



వికారాబాద్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పంచాయతీ ఎన్నికల్లో ఓటింగ్ లేకుండా గెలిపిస్తే ఊరికి రూ.30 లక్షలు ఇస్తానని వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన యాదవ్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. పంచాయతి ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధి కోసం 30 లక్షల రూపాయల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ 30 లక్షల్లో హనుమాన్ మందిరానికి 10 లక్షలు, ముస్లిం వెల్ఫేర్ కు 3.5 లక్షలు, క్రిస్టియన్ వెల్ఫేర్ కు 2.5 లక్షలతో పాటు ఎమర్జెన్సీ ఫండ్ కు 2 లక్షలు కేటాయిస్తానన్నారు. యువకులకు ప్రోత్సాహం ఇచ్చి తనకు అవకాశం కల్పించాలంటూ గ్రామస్తులను కోరారు. ఈ ప్రకటన చర్చనీయాంశం అయ్యింది.

# తెలంగాణ ఉద్యమ జ్యోతి వెలిగించిన సమ్మెట సమ్మయ్య గౌడ్

**రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు స్వీకారం!**



నరసింహుల పేట, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి అంకితభావంతో పనిచేస్తున్న సమ్మెట సమ్మయ్య గౌడుకు రాష్ట్ర స్థాయిలో మరో పదవీ పురస్కారం అందింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శీనన్న ఆశీర్వాదం, తీర్మానంతో, సమ్మయ్య గౌడును రాష్ట్ర కార్యదర్శిగా అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించి అండగా నిలిచిన నాయకులు – అధికార ప్రతినిధి చల్ల వెంకన్న, జిల్లా అధ్యక్షులు ముదోసాని వెంకటేశ్వర్లు, పోలిశెట్టి గణేష్, అలాగే రాష్ట్ర కార్యవర్గం, రాష్ట్ర అధ్యక్షులు, మహిళా ఉద్యమకారులు, జిల్లా, మండల అధ్యక్షులు, ఉద్యమకారులందరికీ సమ్మెట సమ్మయ్య గౌడు హృదయపూర్వక ఉద్యమ నమస్కారాలు తెలిపారు.

## నిద్రలేమికి ఇంటి చిట్కా.. పుల్లని చెర్రీ జ్యూస్- మెగ్నీషియం



హెల్త్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): నిద్ర సర్వరోగ నివారిణి అంటుంటారు పెద్దలు. ఎందుకంటే ప్రశాంతమైన నిద్ర మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. నిద్రలేమి మాత్రం అందుకు భిన్నమైన ప్రభావాన్ని చూపుతుంది. సరిగ్గా నిద్రపట్టకపోతే మానసిక ఆందోళనకు, గందరగోళానికి దారితీస్తుంది. అది ఏకాగ్రతను, జ్ఞాపక శక్తిని దెబ్బతీస్తుంది. ప్రొడక్టివిటీని తగ్గిస్తుంది. అయితే ఈ సమస్యకు ఇంటిలోనే పాటించదగ్గ చక్కటి పరిష్కారం ఉదంటున్నారు నిపుణులు. అదే పుల్లని చెర్రీ పండ్ల జ్యూస్ – మెగ్నీషియం కాంబినేషన్. ఇది ఏ విధంగా మేలు చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

పుల్లని చెర్రీ పండ్ల జ్యూస్ – మెగ్నీషియం కాంబినేషన్ గాఢమైన నిద్రను ప్రేరేపిస్తుందని 2018లో 50 ఏండ్లు పైబడిన 8 మంది ఇన్సామ్నియా బాధితులపై నిర్వహించిన అధ్యయనం సహా పలు ఇతర అధ్యయనాలు సైతం పేర్కొన్నాయి. ఎందుకంటే ఈ జ్యూస్‌లో మెలటోనిన్ అనే నిద్ర హార్మోన్ ఉంటుంది. జ్యూస్ తాగిన తర్వాత అది శరీరానికి “ఇప్పుడు నిద్రపోవాల్సిన సమయం” అన్నట్లుగా నిద్రను ప్రేరేపిస్తుంది. పైగా అందులో ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ కూడా ఉంటుంది కాబట్టి ఇది శరీరంలో ప్రశాంతతకు కారణమయ్యే మెలటోనిన్, సెరటోనిన్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. దానికి తోడు మెగ్నీషియం జోడిస్తారు కాబట్టి నరాలను శాంతరిచి, కండరాలను రిలాక్స్ చేసి, నిద్రను మెరుగు పరుస్తుంది. నిద్రలేమితో ఇబ్బంది పడేవారు నిద్రపోవడానికి గంట ముందు సుమార్వు కప్ (100–120 ml) ప్యూర్ టార్ట్ చెర్రీ జ్యూస్‌లో 1 టేబుల్ స్పూన్ మెగ్నీషియం పౌడర్ కలిపి తాగొచ్చు.

**ముఖ్యమైన ప్రయోజనాలు**

**మెరుగైన నిద్ర:** పుల్లని చెర్రీ పండ్లలో పాలిఫెనాల్స్, ఆంథోసైనిన్స్ అండ్ ఫ్లేవనాయిడ్స్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. పైగా ఇవి సహజమైన మెలటోనిన్‌కు మూలం. ఇది నిద్ర-మేల్కొనే చక్రాన్ని నియంత్రించే హార్మోన్.

**కండరాల పునరుద్ధరణ:** టార్ట్ చెర్రీస్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ(వాపు నిరోధక) గుణాలు తీవ్రమైన వ్యాయామం తర్వాత కండరాల నొప్పి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**వాపు, యాంటీ ఆక్సిడెంట్ ప్రభావాలు:** పుల్లని చెర్రీస్‌లోని శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని, దీర్ఘకాలిక వాపును ఎదుర్కోవడంలో సహాయపడతాయి.

**కీళ్ల ఆరోగ్యం:** ఈ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఆర్థరైటిస్‌తో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో, కండరాల దృఢత్వాన్ని పెంచడంలో, యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి.

## అప్పుడప్పుడూ తినడం మానేస్తే ఆరోగ్యానికి మంచిదే! ఎందుకంటే



హెల్త్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): మనం హెల్తీగా ఉండాలంటే ప్రతిరోజూ శరీరానికి అవసరమైన ఎనర్జీ అందిస్తుండాలి. అంటే ఆహారం తీసుకోవాలి. చాలామంది డైలీ మూడు పూటలు తింటుంటారు. వారి శరీర తత్వాన్ని బట్టి కొందరు ఎక్కువసార్లు, మరికొందరు తక్కువసార్లు కూడా తింటుంటారు. అయితే మనం కొన్నిసార్లు ఆహారం సమయానికి తినకపోయినా లేదా ఒకపూట తినకపోయినా, ఒక రోజు కేవలం ఒకపూటే తిన్నా కూడా పెద్ద నష్టం జరగదు. పైగా ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉపవాసం కూడా దాదాపు ఇలాంటిదే. అయితే ఇది సాధారణ వ్యక్తులకు మాత్రమే.. గర్భిణులు, డయాబెటిక్స్, సాధారణం కంటే తక్కువ బరువు ఉన్నవాళ్లు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవాళ్లకు వర్తించదు.

ఆటోఫేజీ.. అంటే మానవ శరీరం కొన్నిసార్లు ఆహారం తీసుకోకపోయినా, ఆకలిగా ఉన్నా తట్టుకోగల శక్తి. ఇది శరీరంలోని సహజ రీసైక్లింగ్ విధానం ద్వారా లభిస్తుందని జపాన్ శాస్త్రవేత్త యోషినోరి ఒహ్‌సుమి తన పరిశోధనలో కనుగొన్నారు. ఈ ప్రాసెస్ ప్రకారం.. ఆకలిగా ఉన్నప్పుడు లేదా ఏదైనా ఒత్తిడిని అనుభవిస్తున్నప్పుడు మన శరీరంలోని కణాలు తమలోని పాడైన భాగాలను అంటే.. దెబ్బతిన్న ప్రోటీన్లు, ఆర్గనెల్స్ వంటి వాటిని తినేసి, వాటిని రీసైక్లింగ్ చేసుకొని శక్తిని పొందుతాయి. ఆరోగ్యకరమైన కణ భాగాలను తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియను ‘సెల్ఫ్ ఈటింగ్’ అని కూడా అంటారు. ఇది శరీరానికి అతి ముఖ్యమైన రక్షణ వ్యవస్థగా పనిచేస్తుంది.

ఆటోఫేజీ జరగకపోతే.. అంటే.. శరీరంలో కణాల రీసైక్లింగ్ సరిగ్గా పనిచేయకపోతే కూడా.. క్యాన్సర్, అల్జీమర్స్, పార్కిన్సన్స్, డయాబెటిస్, వృద్ధాప్యం వంటివి వేగంగా వస్తాయి. అందుకే అప్పుడప్పుడూ ఇది కూడా అవసరం. నిజానికి ఆటో ఫేజీ అంటే.. గ్రీకు భాషలో “Auto” అంటే.. తను అని, “Phagy” అంటే తినడం అని అర్థం. అంటే కణం తనలోని పాడైన భాగాలను తానే తినేయడం. శరీరంలోని ప్రతీ కణంలో ఉండే నేచురల్ “రీసైక్లింగ్ – క్లీనప్” వ్యవస్థ వంటిది. అందుకే అప్పుడప్పుడైనా ఆటోఫేజీ అవసరం. ఉపవాసం ఉండటం ఉండటం, ఒత్తిడిని అనుభవించడం, వ్యాయామాలు చేయడం వంటి పరిస్థితుల్లో ఇది ఇది యాక్టివేట్ అవుతుంది.

ఆటోఫేజీ వల్ల శరీరంలో కణాలు రీసైక్లింగ్ ప్రక్రియను పొందుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్ కణాల ప్రభావం తగ్గుతుంది. అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి మెదడు వ్యాధుల రిస్క్ తగ్గుతుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగవుతుంది. డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్, కీటో డైట్, సాధారణంగా ప్రజలు అప్పుడప్పుడూ ఉండే ఉపవాసం వల్ల కూడా ఈ విధమైన ప్రయోజనాలు కలుగుతాయి.

## చలికాలం కదా అని వాటర్ తక్కువగా తాగుతున్నారా..? ఈ రిస్క్ తప్పదు!

హెల్త్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): చలి కాలం కదా అని నీరు తక్కువగా తాగుతున్నారా? అయితే రిస్క్‌లో పడ్డట్టే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. నిజానికి చాలా మంది మిగతా సీజన్లతో పోలిస్తే వింటర్‌లో నీళ్లు తక్కువగా తాగుతుంటారు. చల్లటి వాతావరణమే ఇందుకు కారణం. అలాగనీ శరీరానికి సరిపడా నీరు తాగకపోయినా హెల్త్ పరంగా నష్టపోతారు. కాబట్టి సీజన్లతో సంబంధం లేకుండా రోజులో 2 నుంచి 4 లీటర్ల వరకు నీరు తాగితేనే మనం ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ అంతకంటే మరీ ఎక్కువ తాగినా, మరీ తక్కువ తాగినా సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తక్కువ నీరు తాగడంవల్ల తలెత్తే హెల్త్ ప్రాబ్లమ్స్ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**రక్త సరఫరాలో ఆటంకాలు**

వింటర్‌లో నీళ్లు తక్కువగా తాగితే ఆ ప్రభావం మొత్తం శరీరంపై పడుతుంది. అవయవాలకు రక్త సరఫరాలో తేడాలు వస్తాయి. దీంతోపాటు తలనొప్పి, తీవ్రమైన అలసట వంటి ప్రాబ్లమ్స్ వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే



క్రమంగా క్రానిక్ ఫెటీగ్‌కు దారితీయవచ్చు. అంటే ప్రతి రోజూ తీవ్రమైన అలసట లేదా తలనొప్పి వంటివి అనుభవించే పరిస్థితి దీర్ఘకాలికంగా కొనసాగుతుంది. కాబట్టి దాహం వేయకపోయినా శరీరానికి సరిపడా నీళ్లు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే డీహైడ్రేషన్ బారిన పడి, ఇతర అనారోగ్యాలు కూడా సంభవించే అవకాశం ఉంటుంది.

**గుండెపై ప్రభావం**

తగినంత నీరు తాగకపోవడం వల్ల శరీరంలో సోడియం, పొటాషియం, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ దెబ్బ తింటుందని నిపుణులు అంటున్నారు. ఈ పరిస్థితి గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. హార్ట్ రేట్‌లో హెచ్చు తగ్గులు సంభవిస్తాయి. అంతేకాకుండా నీరు తక్కువగా తాగడంవల్ల బాడీలో బ్లడ్ సర్క్యులేషన్ సక్రమంగా జరగదు. దీంతో అవయవాల పనితీరు మందగిస్తుంది. ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

**కిడ్నీలు, జీర్ణ వ్యవస్థపై ప్రభావం**

వింటర్‌లో తక్కువ నీరు తాగడం మెటబాలిజంపై నెగెటివ్ ఇంపాక్ట్ చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. దీంతో కడుపులో ఉబ్బరం, తలనొప్పి, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలు తలెత్తుతాయి. కిడ్నీ స్టోన్స్ ఏర్పడే అవకాశం పెరుగుతుంది. మరో విషయం ఏంటంటే.. సరిపడా నీళ్లు తాగితేనే కిడ్నీలు యాక్టివ్‌గా పనిచేస్తాయి. అవి రక్తం నుంచి వ్యర్థాలను వడబోసి యూరిన్ రూపంలో బయటకు పంపడానికి నీరు చాలా ముఖ్యం. ఎలక్ట్రోలైట్స్ తగ్గడం కారణంగా కీళ్ల నొప్పులు, చర్మ సమస్యలు వస్తాయి. కాబట్టి ప్రతి రోజూ కనీసం 2 నుంచి 4 లీటర్ల వరకు నీటిని తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# సస్పెన్స్‌కు తెర.. త్వరలోనే స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ పెళ్లి!



స్పోర్ట్స్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): టీమ్ ఇండియా వుమెన్స్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెళ్లి అర్ధాంతరంగా ఆగిపోయిన సంగతి తెలిసిందే. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో స్మృతి మంధాన పెళ్లి కుదిరింది. కానీ స్మృతి మంధాన తండ్రి అనారోగ్యం కారణంగా పెళ్లిని వాయిదా వేసుకున్నట్టు ముందుగా మంధాన మేనేజర్ ప్రకటించారు. కానీ తరవాత స్మృతి తన సోషల్ మీడియా అకౌంట్ నుండి పలాష్‌తో దిగిన ఫోటోలు అన్నింటినీ డిలీట్ చేసింది. దీంతో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే పలాష్ ముచ్చల్ ఓ యువతితో చేసిన చాటింగ్ లీక్ అయ్యింది.

అందులో పలాష్ రాసలీలలు బయటపడటం దుమారం రేపింది. పలాష్ చాటింగ్ బయటపడటం వల్లనే వీరిద్దరి పెళ్లి ఆగిపోయిందని పెద్ద ఎత్తున వార్తలు వచ్చినప్పటికీ ఇప్పటి వరకు స్మృతి మంధాన స్పందిచలేదు. దీంతో పెళ్లికి పూర్తిగా బ్రేక్ పడిందని అంతా అనుకున్నారు. కానీ తాజాగా పలాష్ తల్లి అమిత కీలక ప్రకటన చేసింది. త్వరలోనే స్మృతి మంధనా పలాష్ ముచ్చల్ వివాహం జరగబోతుందని ప్రకటించింది. స్మృతికి వెల్ కమ్ చెప్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లను సైతం చేశామని వెల్లడించింది.

# రూ.2.4 కోట్లు పలికిన కరీంనగర్ క్రికెటర్



స్పోర్ట్స్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్ కు సంబంధించిన మెగా వేలం తాజాగా జరిగింది. గురువారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో ఢిల్లీ వేదికగా ఈ మెగా వేలం చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. ఇందులో కొంతమంది ప్లేయర్లకు బంపర్ ఆఫర్లు తగులగా, మరి కొంతమంది ప్లేయర్లకు నిరాశ ఎదురయింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ క్రికెటర్ కు దాదాపు రూ.2.4 కోట్లు దక్కాయి.

అంతర్జాతీయ మహిళా వెటరన్ క్రికెటర్, కరీంనగర్ జిల్లాకు చెందిన శిఖా పాండేకు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 వేలంలో భారీ ధర వచ్చింది. శిఖా పాండేను ఏకంగా రూ. 2.4 కోట్లు పెట్టి కొనుగోలు చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ వేలంలో 36 సంవత్సరాలు ఉన్న శిఖా పాండే 40 లక్షల బేస్ ధరతో బరిలోకి దిగారు. అయితే శిఖా పాండే ప్రదర్శన నేపథ్యంలో యూపీ వారియర్స్ జట్టు రూ. 2.4 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా శిఖా పాండే పేరు మారుమవుతోంది. గతంలో 2.2 కోట్లు పలికిన ఆమె ఇప్పుడు మరో రూ.20 లక్షలు పలికారు. కాగా రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగి కుమార్తె అయిన శిఖా పాండే రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్ కు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ శిఖా పాండేపై కోట్ల వర్షం కురవడం గమనార్హం.

ఇది ఇలా ఉండగా, మహిళ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్ వేలంలో దీప్తి శర్మకు మంచి ధర దక్కింది. ఆమెను 3.2 కోట్లకు యూపీ వారియర్స్ దక్కించుకుంది. దీంతో ఈ మెగా వేలంలో దీప్తి శర్మ ఖరీదైన ప్లేయర్ గా రికార్డు సృష్టించింది. ఆర్టీఎమ్ ప్రక్రియ ద్వారా దీప్తి శర్మను యూపీ వారియర్స్ మరోసారి సొంతం చేసుకుంది. అయితే ఈ మహిళల ప్రీమియర్ లీగ్ టోర్నమెంటులో స్మృతి మందాన ఇప్పటి వరకు అత్యధిక ధర పలికి రికార్డు సృష్టించారు. 3.4 కోట్లకు స్మృతి మందానను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు గతంలోని కొనుగోలు చేసింది. ఇక ఇప్పుడు ఆమె తర్వాత దీప్తి శర్మ రెండో స్థానంలో నిలిచింది.

# ధోనీ ఫామ్‌హౌస్‌లో భారత క్రికెటర్లకు విందు




స్పోర్ట్స్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): భారత మాజీ సారధి మహేంద్రసింగ్ ధోని గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన సోషల్ మీడియాలో యాక్టివ్ గా లేకపోయినా ఆయన చేసే పనులు మాత్రం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతూ ఉంటాయి. ధోని నవ్వినా, బైక్ పైన వెళ్లినా ఆ రోజంతా సోషల్ మీడియాలో ఆయన పేరు మారుమోగుతుంది. అలాంటిది భారత క్రికెటర్లకు మహేంద్ర సింగ్ ధోని విందు ఏర్పాటు చేస్తే, వారం రోజులపాటు సోషల్ మీడియాలో ఈ అంశం గురించి చర్చించుకోవడం గ్యారెంటీ.

దక్షిణాఫ్రికా వర్సెస్ భారత్ మధ్య మరో మూడు రోజుల్లో వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. అయితే మొదటి వన్డే మ్యాచ్ ఝార్ఖండ్ లోని రాంచీ వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో రాంచీకి భారత వన్డే జట్టు సభ్యులందరూ చేరుకున్నారు. ఈ తరుణంలోనే మాజీ సారథి మహేంద్రసింగ్ ధోని, వెంటనే భారత జట్టుకు సంబంధించిన ప్లేయర్లు అందరినీ కలిశాడు. వాళు రాంచీలో బస చేస్తున్న హెూటల్ కు వెళ్లి, కలిశాడు ధోని భాయ్. అంతేకాదు గురువారం అర్ధరాత్రి విందు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వాళ్లకు సమాచారం ఇచ్చాడు.

ఇక ధోని పిలవగానే ఎవరు వెళ్లకుండా ఉంటారు. గౌతమ్ గంభీర్ తప్ప మిగిలిన భారత వన్డే క్రికెట్ సభ్యులందరూ గురువారం రాత్రి ధోని ఫామ్ హౌస్ కు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా భారత ప్లేయర్ లందరికీ తేనేటి విందు ఏర్పాటు చేశారు ధోని. ఇక ఈ డిన్నర్ లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజు, రిషబ్ పంత్, మిగిలిన టీమిండియా ఆటగాళ్లందరూ ఉన్నారు. గురువారం అర్ధరాత్రి 11 గంటల వరకు ధోని ఫామ్ హౌస్ లోనే ఎంజాయ్ చేసిన భారత క్రికెటర్లు, ఆ తర్వాత రాంచీలోని తమ హెూటల్ కు వెళ్ళిపోయారు. అయితే విరాట్ కోహ్లీని మాత్రం ధోని స్వయంగా హెూటల్ దగ్గర డ్రాప్ చేశాడు. దీనికి సంబంధించిన ఫోటోలు అలాగే వీడియోలు వైరల్ గా మారాయి.

## బాబర్ మరోసారి డకౌట్..లంక చేతిలో పాకిస్తాన్ ఘోర ఓటమి




స్పోర్ట్స్ న్యూస్, 28 నవంబర్ (క్రాంతి న్యూస్): పాకిస్తాన్ గడ్డపై జరుగుతున్న టి20 ట్రై సిరీస్ 2025 టోర్నమెంటులో శ్రీలంక మరో అద్భుతమైన విజయం సాధించింది. ఆతిథ్య పాకిస్తాన్ జట్టును మట్టి కల్పించిన శ్రీలంక, ఏకంగా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. గురువారం రోజున ఈ ట్రై సిరీస్ లో భాగంగా పాకిస్తాన్ వర్సెస్ శ్రీలంక మధ్య ఆరవ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో శ్రీలంక మొదట బ్యాటింగ్ చేసింది. ఈ సందర్భంగా నిర్ణీత 20 ఓవర్లు ఆడిన శ్రీలంక జట్టు 5 వికెట్లు నష్టపోయి 184 పరుగులు సాధించింది.

శ్రీలంక బ్యాటర్లలో కమిల్ మిశ్రా 48 బంతుల్లో 76 పరుగులతో దుమ్ము లేపాడు. ఆ తర్వాత కుశల్ మెండీస్ 43 పరుగులతో రాణించాడు. చివరలో జనిత్ 24 పరుగులతో రఫ్ఫాడించాడు. దీంతో 185 పరుగుల టార్గెట్ ను పాకిస్తాన్ ముందు ఉంచింది శ్రీలంక. ఇక ఛేజింగ్ చేసే క్రమంలో పాకిస్తాన్ బ్యాటర్లు, ఎవరు కూడా పెద్దగా రాణించలేదు. ఓపెనర్లు ఇద్దరూ తొందరగానే వికెట్ సమర్పించుకున్నారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజం మరోసారి చెత్త ప్రదర్శన కనబరిచాడు.

ఈ మ్యాచ్ లో రెండు బంతులు ఆడి డకౌట్ అయ్యాడు బాబర్. ఇక పాకిస్తాన్ టి20 కెప్టెన్ సల్మాన్ అఘా ఒక్కడే 44 బంతుల్లో 63 పరుగులు చేశాడు. అతడు ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగతా బ్యాటర్లు ఎవరు సపోర్ట్ చేయలేదు. దీంతో చివరికి ఆరు పరుగుల తేడాతో శ్రీలంక చేతిలో దారుణంగా ఓడిపోయింది పాకిస్తాన్. ఇక ఈ టోర్నమెంట్ లో ఇప్పటికే ఫైనల్ కు శ్రీలంకతో పాటు పాకిస్తాన్ క్వాలిఫై అయ్యాయి. శుక్రవారం అంటే నవంబర్ 29వ తేదీన ఈ రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. ఇందులో గెలిచిన టీమ్ ట్రై సిరీస్ సొంతం చేసుకోనుంది.

KR TV క్రాంతి
శనివారం 29 నవంబర్ 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# తలైవా సినిమాలో పవర్‌ఫుల్ రోల్?



మలయాళ బ్యూటీ రజిషా విజయన్ తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించి ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. అతి తక్కువ సమయంలోనే ఫుల్ ఫేమ్ తెచ్చుకుని స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకునే చాన్స్ దక్కించుకుంది. పలు లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లోనూ నటించిన రజిషా బ్లాక్ బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది.ఇటీవల బైసన్, పరదా వంటి చిత్రాలతో వచ్చిన ఈ భామ తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. కానీ ఈ రెండు సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ బాక్సాఫీసు వద్ద హిట్ సాధించిలేకపోయాయి.

అయినప్పటికీ రజిషాకు ఓ బంపర్ ఆఫర్ వచ్చింది. తాజాగా, స్టార్ హీరో సినిమాలో రజిషా చాన్స్ దక్కించుకున్నట్లు తెలుపుతూ మూవీ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కలంకావల్'. ఇందులో రజిషా కీలక పాత్రలో కనిపించనుంది. జితిక్ కె జోస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్రైమ్, యాక్షన్ థ్రిల్లర్‌లో వినాయకన్, గిబిన్, గోపీనాథ్, మీరా జాస్మిన్ కూడా ఉన్నారు. ఈ చిత్రాన్ని స్వయంగా మమ్ముట్టి ప్రొడక్షన్ హౌస్ నిర్మిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

ప్రమోషనల్ కంటెంట్ పెంచుకునేందుకు మూవీ మేకర్స్ ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నారు. ఇక రజిషా నటిస్తున్నట్లు వెల్లడిస్తూ..ప్రతి చిరునవ్వులో ఒక రహస్యం దాగి ఉంటుంది అనే క్యాప్షన్ జత చేస్తూ అద్దంలో చూసుకుంటున్న హీరోయిన్ పోస్టర్‌ను విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా హిట్ అందుకోలేని ఈ అమ్మడు 'కలంకావల్'పై ఆశలన్నీ పెట్టుకుంది. ఈ మూవీ ఎలాగైనా హిట్ కావాలని తాపత్రయపడుతోంది.

# శ్రావణ భార్గవికి హేమ చంద్ర విడాకులు ఇచ్చాడా..

## ఎట్టకేలకి క్లారిటీ ఇచ్చాడుగా..!



ఒకప్పుడు టాలీవుడ్‌లో క్యూట్ కపుల్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందిన జంట శ్రావణ భార్గవి - హేమచంద్ర. వీరిద్దరు వేర్వేరు దారుల్లో నడుస్తున్నారని చాలాకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ ఇద్దరికీ ఒక పాప ఉంది. అయితే సుమారు మూడు సంవత్సరాల క్రితమే వీరు విడిపోయారని సోషల్ మీడియా పోస్టుల ద్వారా అభిమానులు అంచనా వేస్తున్నా, ఈ విషయం గురించి ఇద్దరూ ఇప్పటిదాకా అధికారికంగా స్పందించలేదు. తాజాగా హేమచంద్రకి ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే ప్రశ్న ఎదురైంది. మీ పెళ్లి జీవితంపై వస్తున్న రూమర్స్, కామెంట్లకు ఎందుకు స్పందించడం లేదని అడగగా, హేమచంద్ర ఇచ్చిన సమాధానం ప్రస్తుతం వైరల్ అవుతోంది.

వార్తలు నిజమా కాదా అన్నది పక్కన పెడితే, అవి తెలుసుకోవడం వల్ల ఎవరికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందో ముందుగా చెప్పమని చెప్పండి. అప్పుడు మాత్రమే తాను సమాధానం ఇవ్వగలనని హేమచంద్ర అన్నారు. తనపైన వచ్చే కామెంట్లు లేదా రూమర్స్ తనను ఏ విధంగానూ ప్రభావితం చేయవని, సింగర్‌గా తన పనిపై మాత్రమే మాట్లాడదలచుకున్నానని ఆయన స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితంపై ఎవరైనా ప్రశ్నలు అడగాలనుకుంటే ఓ Q&A సెషన్ పెట్టొచ్చని, కానీ ముందుగా "ఈ విషయం నీకు ఎందుకు ఉపయోగపడుతుంది?" అనే ప్రశ్నకు వాళు ఇచ్చే సమాధానం తనను సంతృప్తిపరచాలి అన్నారు.

విమర్శలు చేసే వారి మాటలు పట్టించుకునేంత టైం లేదని, జనాలు పక్క వాళ్ల వ్యక్తిగత జీవితాలపై సహజంగానే ఆసక్తి చూపుతారని, వర్క్ గురించే తెలిస్తే దాని గురించి మాట్లాడాలి తప్ప పర్సనల్ విషయాలు తెలుసుకోవడం అనవసరం అంటూ హేమచంద్ర వ్యాఖ్యానించారు. అయితే ఈ ఇంటర్వ్యూలో కూడా ఆయన శ్రావణ భార్గవితో నిజంగా విడిపోయారా లేదా? విడాకులు తీసుకున్నారా? ప్రస్తుతం వారి సంబంధం ఏ స్థితిలో ఉంది? అనే విషయాలకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. దీనితో హేమచంద్ర ఇంటర్వ్యూ మరింత చర్చకు దారితీస్తోంది కానీ, పాత రూమర్స్‌కు మాత్రం ముగింపు పడలేదు.



# 'స్పిరిట్' సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ప్రభాస్

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది. ఈ సినిమా షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది.

తాజా సమాచారం ప్రకారం, హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది.

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా యొక్క రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com